హైదరాబాద్ వార్త



# గ్రేటర్‌లో 3.5లక్షల నాన్‌రెసిడెన్షియల్ ప్రాపర్టీలు

**-ట్రేడ్ లైసెన్స్ జారీ, ఫీజు వసూలు బాధ్యత డిసిలదే..**

**-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జెడ్‌సి అనురాగ్‌జయంతి, సిసిపి శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 3.5 లక్షలనాన్ - రెసిడెన్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయని నాన్,రెసిడెన్షియల్ ప్రాపర్టీ, ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీతో పాటు ఫీజు వసూలు బాధ్యత సర్కిల్ డిసిలదే అని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ తేల్చి చెప్పారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆస్తిపన్ను వసూలు, ట్రేడ్ లైసెన్స్, పెండింగ్ కేసుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అన్ని నాన్ - రెసిడెన్షియల్ ప్రాపర్టీ లకు ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలన్నారు. ప్రతి వారం జోనల్ కమీషనర్లు తమ పరిధిలో ఎన్ని నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి, ఎన్నింటికి ట్రేడ్ లైసెన్స్ జారీ పన్ను వసూలు పురోగతిని తెలిపే వివరాలు అందించాలన్నారు. నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీ దారులు అందరూ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలన్నారు. గత సంవత్సరం జులై నెలలో ఆస్తి పన్ను లక్ష్యం సాధింపులకు అనుగుణంగా ఈ నెలలో కూడా అంతకు తగ్గకుండా ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. టాక్స్ వసూలు ద్వారానే ఉద్యోగులు నెలసరి వేతనాలతో పాటుగా మౌలికసదుపాయాలు కల్పించడం జరుగుతున్నా నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు జరగడం లేదన్నారు. అలాగే అన్ని రకాల కోర్టు కేసులను త్వరగా క్లియర్ చేసేందుకు జోనల్ స్థాయిలో వారంలో ఒకరోజు తప్పనిసరిగా సమీక్షించాలని జోనల్ కమిషనర్ లను ఆదేశించారు.టౌన్ ప్లానింగ్ విభాగంలో కోర్టు కేసుల పరిష్కారంపై డిప్యూటీ కమిషనర్‌లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. హైకోర్టు జారీ చేసిన పెండింగ్ ఆదేశాలను సమీక్షించి, నిర్ణీత సమయంలోపు ఆదేశాలను పాటించేలా వివరణ ఇవ్వాలని చెప్పారు. నిర్దేశిత సమయం లోగా కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందిపై దాడులు ఉపేక్షించమని కమిషనర్ స్పష్టం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీ ప్రధాన రహదారిపై రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తున్న వ్యక్తినీ ప్రశ్నించిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై కత్తితో దాడికి యత్నించిన ఘటన పై సమావేశంలో కమిషనర్ ఆరా తీశారు. జూబ్లీ హిల్స్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఘటన వివరాలు కమిషనర్ కు తెలిపారు. దాడికి యత్నించిన వ్యక్తి పై ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశామని చెప్పారు. పోలీసులు ఆవ్యక్తిని అరెస్ట్ కూడా చేశారని తెలిపారు. బాధ్యులకు శిక్ష పడేలా కేసును ఫాలో అప్ చేయాలన్నారు.ఎవరైనా బెదిరింపు ఘటనలు పాల్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. జీహెచ్ఎంసీ స్టాఫ్ దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (లీగల్ ) సత్యనారాయణ, జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, భోర్ఖడే హేమంత్ సహదేవరావు, రవి కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు సత్వరన్యాయం జరిగేలా చూడాలి

**-రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద**




సమావేశంలో మాట్లాడుతున్న నేరళ్ల శారద, కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** బాధిత మహిళలకు సత్వరమే న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద సూచించారు.ఈమేరకు శనివారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సఖి కేంద్రాల సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్స్ అలాగే సంబంధిత సభ్యులతో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ మహిళా బాధితుల సమస్యలను ప్రత్యేక దృష్టితో చూడాలని వారికి సత్వరమే న్యాయం జరిగే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పరిధి లోని అన్ని జిల్లాల్లో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై బాధిత మహిళలు సఖి కేంద్రాలకు వచ్చిన వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. పాత చట్టాలు ఐపిసి 1986 చట్టం బదులు భారతీయ న్యాయ సంహిత చట్టం 2023, సిఆర్పిసి 1973 చట్టం బదులు సురక్ష సంహిత చట్టం 2023 అలాగే ఐఈఏ 1973 చట్టం బదులు భారతీయ సాక్షా అదినియమ్ 2023 చట్టాలను భారత ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ కొత్త చట్టాలు డిసెంబర్ 2023న రూపొందించబడ్డాయని అలాగే జులై 2024 లో అమల్లోకి రావడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాలు అమలు తీరు అలాగే పూర్తిస్థాయి అవగాహన అన్ని జిల్లాల సఖి కేంద్రాల అడ్మినిస్ట్రేటర్లు, సభ్యులు అవగాహన ఉండే విధంగా ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. సఖి సెంటర్లో కష్టాలతో వచ్చే మహిళలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని భావన కల్పించాలని అలాగే వారి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించబడాలని తోటి మహిళలకు కొత్త జీవితం కల్పించాలని సంకల్పం మనం కల్పించాలనిసూచించారు. జిల్లాలలో సమస్యకు పరిష్కారం దొరకని విధంగా ఉన్న సమస్యలను రాష్ట్రస్థాయికి సత్వరమే పంపాలని అలాగే సమస్యలతో వచ్చిన ప్రతి మహిళకు ఉమెన్ కమిషన్ తప్పక అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టాలలోని హక్కుల ద్వారా బాధిత మహిళలకు న్యాయం చేకూరే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం శిక్షణలో భాగంగా నల్సార్ యూనివర్సిటీ రీసెర్చ్ అసిస్టెంట్ రాజా చంద్ర భారత ప్రభుత్వం తెచ్చిన మూడు నూతన చట్టాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షాహిన్ అఫ్రోజ్, ఈశ్వరి బాయ్, శుద్ధం లక్ష్మి, గద్దల పద్మ, కొమ్ము ఉమాదేవి యాదవ్, ఏ రేవతి రావు, కార్యదర్శి పద్మజా రమణ అదనపు కలెక్టర్లు జి ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, డిఆర్ఓ వెంకటాచారి అన్ని జిల్లాల సఖి అడ్మినిస్ట్రేటర్లు, వివిధ విభాగాల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను చెరబడుతున్న ఆక్రమార్కులు..



- అప్పా చెరువు, మామిడికుంట చెరువులో భారీగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు
- రాబోయే రోజుల్లో పొంచి ఉన్న ప్రమాదం
- చెరువులో సరిహద్దులు ఏర్పాటు చేసి రక్షించాలంటున్న స్థానికులు

**అత్తాపూర్ జూలై26, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండలంలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. మండలంలో గగన్‌పహాడ్ గ్రామంలోని అప్పా చెరువు మరియు మామిడికుంట చెరువులు ఉన్నాయి. చెరువుల విస్తీరణం,ఎఫ్‌టిఎల్,బఫర్‌జోన్ లెక్కలు రికార్డులలో ఉన్నట్లు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.చెరువును పలువురు వ్యాపారస్తులు కబ్జా చేసి విధ్వంసం సృష్టిస్తున్న అధికారులు ,స్థానిక ప్రజాప్రతినిధులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.చెరువులో చేపట్టిన అక్రమ కట్టడాలు,రేకుల షెడ్లను అడపాదడపా కూల్చివేస్తూ వదిలేస్తున్నారు.గతంలో అప్పా చెరువు విస్తీర్ణం 40.13 ఎకరాలు ఉండగా ప్రస్తుతం చెరువు విస్తీర్ణం 20 ఎకరాల కంటే తక్కువగా తగ్గింది.దీనికి ప్రధాన కారణం పలువురు వ్యాపారవేత్తలు అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చెరువులను ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించుకొని వివిధ వ్యాపారాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అదే విధంగా మామిడికుంట చెరువు విస్తీర్ణం 23 ఎకరాలు ఉండగా ప్రస్తుత చాలా వరకు కబ్జాకు గురైంది. అప్పా చెరువు మాదిరిగానే, ఈ చెరువు కూడా వేగంగా భూఆక్రమణ గురై వ్యాపారస్తులు షెడ్లు నిర్మించి వ్యాపారానికి అడ్డగా మార్చుకున్నారు.



రోడ్డుపై పారుతున్న చెరువు నీరు

**గత సంవత్సరం హైడ్రా కూల్చివేతలు :**

2024లో అప్పచెరువులో నిర్మించిన కొన్ని అనధికారిక గోదాములపై హైడ్రా కూల్చివేతలు చేపట్టి వదిలేసింది. అయితే అప్పటి నుండి మళ్లీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.మళ్లీ చెరువుపై హైడ్రా అధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో సరిహద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**చెరువు కబ్జాతో పొంచి ఉన్న ప్రమాదం**

చెరువులు పూర్తిగా కబ్జాకు గురవుతుండడంతో వరద నీరు స్థానిక కాలనీలోకి వేళ్లే ప్రమాదం ఉందని అదేవిధంగా చెరువులో అక్రమ షెడ్లు నిర్మించి వ్యాపారం సాగిస్తుండడంతో ప్రజల భద్రత,పర్యావరణ సుస్థిరత ,జీవవైవిద్యానికి తీవ్రమైన ముప్పు పొంచు ఉందని గాలిలోకి ఫ్యాక్టరీల నుండి విషం వాయువులు వదలుతుండడంతో రాబోయే రోజులో చెరువులోని నీరుతో పాటు స్థానిక కాలనీలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు : స్థానికులు**

చెరువు కబ్జాపై పలు మార్లు రెవెన్యూ శాఖ, నీటిపారుదల శాఖ, హెచ్ఎండబ్ల్యు మరియు కాలుష్య నియంత్రణ మండలికి ఫిరాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా రెండు చెరువుల అసలు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్ ) సరిహద్దులను తక్షణమే సర్వే చేసి గుర్తించాలని జోన్ లోపల లేదా వెంట నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**చెరువులను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి**

**-డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి**

చెరువును ఆక్రమించిన వారితో పాటు సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి డిమాండ్ చేశారు.చెరువుల పరిరక్షణ కోసం ఇతర పర్యావరణ మార్గదర్శకాల ప్రకారం చెరువులను వాటి అసలు విస్తీర్ణానికి పునరుద్ధరించడానికి మరియు వాటిని రక్షించడానికి జివో 111 తీసుకోవచ్చి మన సహజ జల వనరుల మరింత విధ్వంసాన్ని కాకముందే తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నగరాన్ని వీడని ముసురు..

**-నిండు కుండలా మారిన హుస్సేన్‌సాగర్**



బోయిన్‌పల్లిలోని పోచ్చమ్మ దేవాలయం వద్ద కురిసిన వర్షనికి జలమయమైన రోడ్డు



**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో నగరవాసులకు తిప్పలు తప్పడం లేదు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో డ్రైనేజీలు పొంగిపోతున్నాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. దీంతో గంటల తరబడి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసులకు వెళ్లేవారు, తిరిగి వచ్చేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు. వానాకాలంలో పడిపోయిన చెట్లు, రోడ్లపై నిలిచిన నీరు వంటి సమస్యలు ఎదురైతే తక్షణమే జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు సూచించారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు హుస్సేన్ సాగర్ చేరుకోవడంతో తూము గేట్లు ఎత్తి నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ట్యాంక్ బండ్‌కు భారీగా చేరుతున్న వరద నీరుతో హుస్సేన్ సాగర్‌పుల్ ట్యాంక్‌లా తయారయ్యింది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 514.75 మీటర్లు. గరిష్ఠ స్థాయికి నీటిమట్టం చేరుకోవడంతో నాలుగు తూమ్‌ల నుంచి నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో మరింత పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలన చేస్తున్నారు..

# డెంగ్యూ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్**



డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతంలో పర్యటిస్తున్న అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో డెంగ్యూ వ్యాధి నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ (హెల్త్) సి.ఎన్. రఘు ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సనత్ నగర్‌లో ఇద్దరు వ్యక్తులకు డెంగ్యూపాజిటివ్ రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ శనివారం సనత్ నగర్‌లో డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన కాలనీలో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు.సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని ఎస్ఆర్‌టి కాలనీలో డెంగ్యూ బాధితులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.డెంగ్యూ కేసులు నమోదైన కాలనీలలో జ్వరపీడుతులు, అనుమానితులకు డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యాధికారులు,సిబ్బందికి సూచించారు.దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను ఎదుర్కోవడానికి, జీఎచ్ఎంసి ఎంటమాలజీ బృందాలు అవగాహన డ్రైవ్‌లు, యాంటీలార్వా ఆపరేషన్‌లు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు.దోమలు సంతానోత్పత్తి ప్రదేశాలను గుర్తించడంతో పాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. స్లమ్స్, స్కూళ్లు, హాస్టళ్లలో యాంటీలార్వల్ ఆపరేషన్స్‌ను ఉద్భృతం చేయాలన్నారు. ఇంటి లోపల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలనీ ప్రజలకు అదనపు కమిషనర్ సూచించారు.ఈకార్యక్రమంలో హెల్త్ జాయింట్ కమిషనర్ శంకర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ చంద్ర శేఖర్ రెడ్డి, హెల్త్, మలేరియా విభాగం అధికారులు, పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణ తరగతులు




శిక్షణ తరుగతులో ప్రసంగిస్తున్న కవిత

**కొంపల్లి, జూలై 26, ప్రభాతవార్త** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు లీడర్ పేరుతో ప్రారంభమైన శిక్షణా తరగతులను తెలంగాణ జాగృతి ఫౌండర్ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల నుండి వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం నాయకులం కావాలి, మనతోపాటు మరికొందరి నాయకులను తయారు చేసుకోవాలన్నదే ఈ శిక్షణా తరగతుల ఉద్దేశం అన్నారు. శత్రువులు దెబ్బ కొట్టకుండా చూడడం, కొట్టాలన్న ఆలోచన రాకుండా చూసుకోవాలన్నారు. మన ఆలోచనలు, అంచనాలు ఒక పక్క సుభాష్ చంద్రబోస్‌ను, మదర్ థెరిస్సాను పోలి ఉండాలని, చాకలి ఐలమ్మ పోరాట పటిమ కలిగి ఉండాలన్నారు. రాజకీయాలను బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జాగృతి నాయకులకు పదే పదే చెపుతున్నారు. రాజకీయాలపై విమర్శలు వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణ జాగృతి కేవలం తెలంగాణ వాదం కోసం పని చేస్తుందన్నారు. ఆనాడు పోలవరం ప్రాజెక్టును అడ్డుకున్నాం, ఈ నాడు మరో ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని తెలిపారు. తెలంగాణ ప్రజలకుకు నష్టం కలిగించే ఏ ప్రాజెక్టునైనా అడ్డుకుంటామన్నారు. మహిళా నాయకులు, బహుజన నాయకులు ముందుకు రావాలన్నారు. అనేక అంశాలు ఉన్నాయని వాటిపై చర్చించాలన్నారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఆగస్ట్ నెల నుండి ప్రతి నెల ఉమ్మడి పది జిల్లాల వారీగా లీడర్ నాయకత్వ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ చారి, పీఆర్‌ఓలు నవీన్ కామెరా, నరేష్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టు రట్టు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 26, ప్రభాతవార్త** శంషాబాద్ ఎస్ఓటీ పోలీసుల బృందం కూకట్‌పల్లిలో నకిలీ విద్యా ధృవపత్రాలను తయారు చేస్తున్న ఓ కన్సల్టెన్సీ ముఠా గుట్టును రట్టు చేసింది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, ప్రధాన సూత్రధారి పరారీలో ఉన్నట్లు పోలీసు లు తెలిపారు. కూకట్‌పల్లిలోని శ్రీ వ్యాస కన్సల్టెన్సీ పేరుతో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న అకసాపు హరీష్, మావురి మహేష్ అనే ఇద్దరు భాగస్వాములను అదుపులోకి తీసుకున్నా రు. వీరు ఉత్తరప్రదేశ్‌లోని వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీ, జవన్‌పూర్ పేరుతో నకిలీ బీ.కాం, బీ.టెక్ సర్టిఫికెట్లను తయారుచేసి ఆశావహులైన అభ్యర్థులకు డబ్బులకు విక్రయిస్తూ వచ్చారు. ఈ వ్యవహారంలో విజయవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తి కూడా పాలుపంచుకున్నట్లు పోలీసులు అను మానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే అతను ప్రస్తుతం పరారీ లో ఉన్నాడనీ దర్యాప్తులో భాగంగా ఈ కన్సల్టెన్సీ ఇప్పటివరకు మొత్తం 46 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు సిద్ధం చేసినట్లు తెలి సింది. వీరిలో 24 మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లను పొంద గా మిగిలిన 22 మంది పూర్తి డబ్బు చెల్లించకపోవడంతో వారికి సర్టిఫికెట్లు అందలేదనీ స్పష్టంగా తెలుస్తోంది. కాగా నకిలీ సర్టిఫికెట్లు పొందిన 24 మందిలో 22 మంది అభ్యర్థులు ఇప్పటికే అమెరికా, యూకే, ఐర్లాండ్ వంటి దేశాలలో ఉద్యోగంలో చేరినట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రధాన నిందితులైన అకసాపు హరీష్ (32) మాఊరి మహేష్ (33)ల నుండి రెండు మొబైల్ ఫోన్లు, ఒక డెస్క్‌టాప్ కంప్యూటర్, నకిలీ సర్టిఫికెట్ల తయారీకి సంబంధించిన ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరి కొంతమంది ప్రమేయం ఉందా అనే కోణంలో మరింత లోతైన విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.



## ఆకుపచ్చని భవిష్య నిధిగా శ్రీగంధం



శ్రీగంధం మొక్కలు

**పేట్ బషీరాబాద్, జూలై 26, ప్రభాతవార్త**

అత్యధిక లాభాలు పొందడానికి ఏకైక మార్గం శ్రీగంధం మొక్కలు పెంచడమే అని జీవవైవిధ్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాష్ట్రంలో శ్రీగంధం మొక్కలు పెంచే రైతులు, ఆసక్తి ఉన్నవారికి తెలంగాణ అటవీ శాఖ అధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించి, సాగు పద్ధతులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లో శ్రీగంధం సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. ఆయుర్వేదంలో ఉపయోగించే ఔషదాలలో శ్రీగంధం ఒకటి. శ్రీ గంధం మొక్కలలో ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉండటం వల్ల ఈ మొక్కకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ మొక్కను సౌందర్య ఉత్పత్తులు, అగరబత్తులు, వివిధ రకాల పర్ఫ్యూమ్‌లలో ఎంత విరివిగా ఉపయోగిస్తారు. రాష్ట్ర అటవీ శాఖ పరిశోధనా విభాగం , ఫారెస్ట్ రిసెర్చ్ సెంటర్ సిద్దిపేట జిల్లా ములుగు, దూలపల్లిలో అభివృద్ధి చేసిన శ్రీగంధం మొక్కలను అందిస్తుంది. ఒక్కొక్క మొక్కను రూ.25 చెల్లించి, కావల్సిన మొక్కలను తీసుకోవాలని తెలిపారు. ఫారెస్ట్ రిసెర్చ్ విభాగం. రైతులు, ఉద్యానవన ఔత్సాహికులు, ఇతర పర్యావరణ ప్రేమికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం స్టేట్ సిల్వికల్చరిస్ట్, హైదరాబాద్ వారిని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ 8500771349 / 9703433429 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## కార్గిల్ విజయ్ దివస్



5కె రన్‌ను ప్రారంభిస్తున్న రామచందర్ రావు

**పేట్ బషీరాబాద్, జూలై 26, ప్రభాతవార్త**

కార్గిల్ విజయ్ దివస్ ప్రేరణతో శనివారం ఉదయం షాపూర్ నగర్ చౌరస్తా బిజెపి ఆఫీస్ నుండి సూరారం కట్ట మైసమ్మ గుడి వరకు 129 (సూరారం) డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి 5కె మారథాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి అధ్యక్షులు డా. ఎస్. మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యకులు రాజా రెడ్డి, బావిగడ్డ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, విగ్నేశ్వర్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయేంద్ర రెడ్డి, రాజేష్ చారి, రాజు, జోగిని సతి సాగర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దుర్యోధన రావు, సంతోష్ గుప్తా, దీపక్ జాల వెంకటేష్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, సిద్ధార్థ, బండారు తిరుపతి దాస్, రాజేష్, కిరణ్, నరసింహ, సరోజా దేవి, స్వాతీ తదితరులు పాల్గొన్నారు.

## వేణు గోపాలరావుకు విశ్వగురు వరల్డ్ రికార్డు పురస్కారం



విశ్వ గురు వరల్డ్ రికార్డు పురస్కారాన్ని అందుకుంటున్న సెట్విన్ ఎండి కె.వేణు గోపాలరావు

**చార్మినార్,జూలై 26 ప్రభాతవార్త :**

నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలను, నైపుణ్య అభివృద్ధిలో విశేష ప్రతిభ కనపరిచిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణు గోపాలరావుకు ప్రతిష్టాత్మకమైన విశ్వగురు వరల్డ్ రికార్డు పురస్కారం లభించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా ఎండి వేణు గోపాలరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ మేనేజింగ్ డైరెక్టర్ సత్య వోలు రాంబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా శనివారం పాతబస్తీ పురానీహవేలిలోని సెట్విన్ ప్రధాన కార్యాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెట్విన్ ఎండి వేణు గోపాలరావు మాట్లాడుతూ విశ్వ గురు వరల్డ్ రికార్డు పురస్కారాన్ని అందుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

## నేడు పాతబస్తీలో బోనాల జాతర ముగింపు సమావేశం

**చార్మినార్,జూలై 26 ప్రభాతవార్త :**

ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాల ముగింపు సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్ తెలిపారు. పాతబస్తీ హరిబౌలిలోని అక్కన్న మాదన్న శ్రీ మహంకాళి ఆలయం ప్రార్ధన మందిరంలో ఆదివారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, సమావేశంలో బోనాల ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరగటానికి అన్ని విధాల సహకరించిన ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, దేవాలయాల కమిటీల ప్రతినిధులను సమావేశంలో సన్మానించటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## నీటి టబ్‌లో పడి బాలుడు మృతి

**చార్మినార్,జూలై 26 ప్రభాతవార్త :**

బట్టలు ఉతికే టబ్‌లో పడి పదకొండు నెలలు బాలుడు మృతి చెందిన సంఘటన కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..రంనాస్‌పుర ప్రాంతానికి ఆదిల్ వృత్తిరీత్యా ప్లంబర్. ఆదిల్‌కు ఉబేద్ (పదకొండు నెలల) బాబు ఉన్నాడు. శనివారం రాత్రి 7.20 గంటల సమయంలో అదిల్ భార్య ఇంట్లోని బట్టలను ఉతకటానికి టబ్‌లో వేసింది. ఆదిల్ భార్య ఇంట్లో పనులు చేస్తున్నది. అదే సమయంలో పద కొండు నెలల బాలుడు ఉబేద్ మెల్ల మెల్లగా బంగురు కుంటు బట్టలు ఉతికే టబ్‌లో పడి పోయాడు. కొంత సేపటి తర్వాత ఆదిల్ భార్య వచ్చి చూడగా ఉబేద్ టబ్‌లో పడి ఉన్నాడు. వెంటనే పదకొండు నెలల బాబును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు బాబు మృతి చెందినట్టు ధృవీకరించారు. ఈ కేసును కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది : బండి రమేష్

**మూసాపేట్, జూలై 26, ప్రభాతవార్త :**

పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి పది కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ పెద్ద ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసమే పనిచేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగడంలేదని హౌసింగ్ బోర్డ్ భూములను అమ్ముకుంటున్నారని కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై బండి రమేష్ శనివారం మూసాపేట్‌లోని హేమ దుర్గాభవాని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన చేస్తోందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోదన్నారు. ఇక కూకట్‌పల్లి నియోజకవర్గం విషయానికి వస్తే ఎమ్మెల్యే కృష్ణారావు సాంకేతికంగా గెలిచినా నైతికంగా ఓడిపోయారని, అతని గెలుపును తాను అంగీకరించడం లేదని రమేష్ పేర్కొన్నారు. కృష్ణారావు ఎమ్మెల్యేగా గత 11 ఏళ్లగా నియోజకవర్గానికి ఏం చేశాడంటూ రమేష్ ప్రశ్నించారు. ప్రత్యర్థి వర్గాల ఫోన్లు ట్యాప్ చేయించడం అధికారులను బెదిరించడం ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టడం తప్ప అతను నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాప్ అయిన వారి పేర్లను ఆయన మీడియాకు వెల్లడించారు. రోజుకు రెండు గంటలు మించి ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే ప్రభుత్వంపై తరచూ పనికిరాని, పసలేని విమర్శలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అసలు హౌసింగ్ బోర్డ్‌ను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని, హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం పలు రక్షణ చర్యలు తీసుకుంటుందని అన్నారు. టిఆర్ఎస్ హయంలోనే హౌసింగ్ బోర్డ్ స్థలాలను ప్రభుత్వ స్థలాలను చెరువులు కుంటలు ఆక్రమించి నాయకులు కార్యకర్తలు దోచుకుతిన్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోడ్లు కబ్జా చేసి డబ్బాలు వేయించి వారి నుంచి డబ్బులు వసూలు చేసేది



మీడియాతో మాట్లాడుతున్న బండి రమేష్

నీ అనుచరులే అని విమర్శించారు. చెరువుల సుందరీకరణ పేరుతో టిఆర్ఎస్ నాయకులు దోచుకోవడానికి దారి చూపారన్నారు. నియోజకవర్గంలోని చెరువులు కబ్జా అయితే వాటిని రక్షి ంచేందుకు హైడ్రా తీసుకువస్తే దాని మీద విషం చిమ్ముతున్నారని పేర్కొన్నారు. డబల్ బెడ్రూంలో కోసం 31 వేలు అప్లికేషన్లు వస్తే 900 మందికి మాత్రమే ఇచ్చారని కైతలాపూర్‌లో నిర్మించిన ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా అలాగే ఉన్నాయన్నారు. గత 15 ఏళ్లలో పేదలకు ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వలేదని తమ ప్రభుత్వం 28,000 మందికి త్వరలో రేషన్ కార్డు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దేశంలోనే మొట్టమొదటిగా రేవంత్ రెడ్డి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ 10 కోట్లు కేటాయించడంతోపాటు మరెన్నో నిధులను మున్సిపాలిటీకి జిహెచ్ఎంసికి ఇవ్వడం జరిగిందన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఏం జరగలేదని హౌసింగ్ బోర్డ్‌లో ఇంకా ఎల్ఐజీ ఇళ్లు రిజిస్టర్ కాలేదని, ట్రాఫిక్ సమస్య అలాగే ఉందని, అయితే అభివృద్ధి 90 శాతం పూర్తి అయిందని 26 కులాలను బీసీల్లో కలుపుతామని ఎన్నికల ముందు పెద్ద డ్రామా ఆడారనీ విమర్శించారు. మూసాపేట వై జంక్షన్, జేఎన్టీయూ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, కూకట్పల్లిలో పీజీ కాలేజీ ఏర్పాటుకు హౌసింగ్ బోర్డ్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, ఎస్సీ వర్గీకరణకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సమావేశంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల చెర నుంచి మమ్మల్ని కాపాడండి

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:**

నాలుగు దశాబ్దాలుగా కబ్జాదారుల చెరలో ఉన్న తమ ప్లాట్లను తమకు అప్పగించాలని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లాడి సందీప్ కుమార్, ఉపాధ్యక్షులు ఆర్.వి. రామమూర్తి, కోశాధికారి కె.రమేశ్, సంయుక్త కార్యదర్శి సి. రవికాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ గ్రామంలో 495 ఎకరాల లేఔట్‌లో 1984 నుంచి 89 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు నాలుగు దశాబ్దాలుగా కబ్జాదారులు ప్లాట్లదారులను బెదిరింపులకు గురిచేస్తూ ప్లాట్ల దగ్గరి రావడా చేస్తున్నారని ఆరోపించారు. అంతేగాక, స్వానిక ఐలార్ గ్రామస్తులతో దాడులు చేస్తున్నారని వాపోయారు. దీంతో ప్లాట్లు దక్కకపోవడంతో బాధిత 10వేల కుటుంబాలు సతమతమవ తున్నారని తెలిపారు. తాము పొజిషన్‌లో ఉన్నా కబ్జాదారులు నోటరీ పేరిట 700 ఇండ్లు నిర్మించి అమ్మేసుకొం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు సందీప్‌కుమార్, రామ్మూర్తి, రమేష్ తదితరులు

టూ కోట్ల రూపాయలు సంపాదించుకొంటున్నారని పేర్కొన్నారు. గతంలో కలెక్టర్లకు, ఎస్పిలకు దరఖాస్తులు ఇచ్చినా, హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్లాట్లు కొన్నవారిలో 400మందికిపైగా మృతిచెందారని తెలిపారు. త్వరలోనే సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి, తమ సమస్య విన్నవించుకొంటామని తెలిపారు. తమ ప్లాట్లు తప దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు వేడుకొన్నారు.

## ఉత్సాహంగా టిస్కాన్‌యూత్ రెగెట్టా పోటీలు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:**

క్రీడారాజధాని హైదరాబాద్ వేదికగా 5వ సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ టిస్కాన్ యూత్ ఓపెన్ రెగెట్టా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. దీనికి మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ,సికింద్రాబాద్ క్లబ్ ఉపాధ్యక్షుడు అశ్విన్ సింగ్, టైటిల్ స్పాన్సర్ గా వ్యవహరిస్తున్న టిస్కాన్ రెడిబిల్డ్ ప్రతినిధి ఆదిత్య జైన్ తో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా అధికారిక రెగాటా టీ షర్టులను మంత్రి ఆవిష్కరించి పోటీల్లో పాల్గొంటున్న సెయిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈవెంట్ జూలై 26 నుండి 30 వరకూ ఐదు రోజుల పాటు జరగనుంది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహించేందుకు ఈ పోటీల్లో ప్రదర్శన కీలకం కానుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా యువ సెయిలర్లు యూత్ రెగెట్టా పోటీల్లో పాల్గొంటున్నారు. హైదరాబాద్ ఐకానిక్ సరస్సుగా పేరున్న హుస్సేన్ సాగర్ ఈ పోటీలకు ఆతిథ్యమిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు , మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 వరకు రేసులు జరగనున్నాయి. యూత్ ఓపెన్ రెగెట్టాలో




పోటీల ప్రారంభోత్సంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, అశ్విన్‌సింగ్, ఆదిత్యజైన్ తదితరులు

నాలుగు ప్రధాన కేటగిరీలుగా ఓపెన్ 420 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ ఈ పోటీల్లో అత్యుత్తమ సెయిలర్లతో బరిలోకి దిగుతోంది. ఆప్టిమిస్ట్ టీమ్‌లో వనీశా అలంపూర్, శ్రింగరి రాయ్, ఇషి గుప్తా, సృష్టి సింగ్ 4 టీమ్‌లో క్రితిక, రిషిత్ అలంపూర్, దియా పటేల్, అగస్త్య దామిశెట్టి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. గత ఏడాది విజేత మాన్యా రెడ్డి ప్రస్తుతం భారత్ దేశం తరపున అమెరికాలో యూత్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో పోటీపడుతుండడంతో ఆమె ఈ పోటీలకు దూరమైంది.

## దాశరథి రచనలు తెలంగాణ ఉద్యమనేపధ్యాన్ని, ఆకాంక్షలను నెరవేర్చాయి : డాక్టర్ దేవేంద్ర

**చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త:** మహా కవి దాశరథి తన రచనల ద్వారా ఉద్యమనేపధ్యాన్ని, వారి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షని నెరవేర్చాయని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం డాక్టర్ దేవేంద్ర అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డా బి. ఆర్. అంబెద్కర్ అటానమస్ కళాశాల, వెంకట్ కళా సెమినార్ హాల్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి శతజయతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దాశరథి రచననల్లోని కవితలు ,పాటలు విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వినిపించారు. డా దేవేంద్ర మాట్లాడుతూ దాశరథి జీవితం లోని ఎన్నో ఆసక్తికర విశేషాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా మట్టాశేఖర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తెలుగు , హిందీ, భాషల్ని ఎన్నుకున్నట్లైతే సులభంగా తమ లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ ప్రో. విష్ణుప్రియా పాట్లాడుతూ దాశరథి వ్యక్తిత్వం,



ప్రసంగిస్తున్న చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం డాక్టర్ దేవేంద్ర

జీవిత విషయాల్ని నేటి యువత తెలుసుకోవాలని అన్నారు. డైరెక్టర్ (ఇవల్యూయషన్) ప్రో. యాదగిరి ప్రసంగిస్తూ భాషా విభాగం వారు ఇటువంటి కార్యక్రమాల్ని నిర్వహించి మహనీయుల జీవితాల్ని అధ్యయనం చేసే లా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ ముదిగొండ భవాని ,డా. విజేందర్, భాషా విభాగాల అధిపతులు డా. మాధవి, కవిత, అధ్యాపకులు డా. అశోక్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## జీవితాంతం కవిగా జీవించిన జ్ఞానపీఠ విశ్వంభరుడు డా. సినారె : చిత్రకారుడు నర్సింగరావు

**నాంపల్లి, జూలై 26 ప్రభాతవార్త :** జీవితాంతం కవిగా జీవించిన జ్ఞానపీఠ విశ్వంభరుడు డా. సి.నారాయణరెడ్డి అని ప్రముఖ నటుడు, దర్శకుడు, కవి, చిత్రకారుడు బి.నర్సింగరావు శ్లాఘించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన పరిషత్తులోని డా. దేవుల పల్లి రామానుజరావు కళావేదికలో శనివారం జరిగిన డా. సినారె 94వ జయంత్యుత్సవంలో ప్రముఖ కవి, సినీనటుడు, దర్శకుడు, చిత్రకారుడు బి.నర్సింగరావు ముఖ్య అతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ సిల్మానాయక్ తదితరులతో కలిసి యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా దక్షిణాసియా విభాగం ఆచార్యుడు డా. అఫ్సర్‌కు డా. సి.నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, పురస్కారం కింద 25 వేలరూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించి



అఫ్సర్‌కు డా. సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న నర్సింగరావు, శివారెడ్డి, చెన్నయ్య, నాయక్ తదితర అతిథులు

ప్రదానంచేసి ప్రసంగించారు. సభాకార్యక్రమానికి ముందు డా. సినారె కర్పూర వసంతరాయలు కావ్యం ఆధారంగా సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు హైదరాబాద్ సమర్పణ, డా. అనుపమ కైలాష్ దర్శకత్వంలో రూపొందిన నృత్య రూపకం వీడియో ప్రదర్శింపబడి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.

## కార్పొరేట్ ఆసుపత్రులు పేదలకు వైద్య సేవలు అందించాలి

**-మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:**

కార్పొరేట్ ఆసుపత్రులు సామాజిక బాధ్యతలో భాగంగా కొంత మేరకు పేదలకు వైద్య సేవలను అందించాలని మాజీ ఎంపి, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, ఎంఎల్ఏ కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడలోని ప్రతిమ ఆసుపత్రిలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా మల్టి స్పెషాలిటీ హెల్త్ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ బిజెపి నాయకులు కన్నె రమేష్ యాదవ్, ప్రతిమ గ్రూప్ ఆఫ్ హస్పిటల్స్ అకడమిక్, మెడికల్ సర్వీసెస్ విభాగాధిపతి డాక్టర్ జి.హరిచరణ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ ప్రసంగిస్తూ కొవిడ్ కాలం నుంచి వైద్యం ఖరీదుగా మారిందని, ప్రస్తుత రోజుల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. తీవ్రమైన వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే పేదల విషయంలో కార్పొరేట్ ఆసుపత్రులు సానుకూలంగా వ్యవహరించాలని, వారి ప్రాణాలను నిలిపేందుకు సహకరించాలన్నారు. ఎంఎల్ఏ కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో కార్పొరేట్ ఆసుపత్రులకు వస్తున్న పేద ప్రజలు వారు ఊహించిన దాని కంటే ఎక్కువ బిల్లు కావడంతో సర్వం



కొల్పోతున్నారన్నారు. రోగాలు వచ్చిన అనంతరం ప్రజలు ఆసుపత్రులకు వెళ్లడం కంటే సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. తన నియోజకవర్గ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ప్రతి నెల రెండవ శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని తాము అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతిమ గ్రూప్ ఆఫ్ హస్పిటల్స్ కార్డియాలజిస్టు డాక్టర్ కొండల్ రావు, జనరల్ ఫిజిషన్ డాక్టర్ సుప్రియ, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి, ఆర్థోపెడిక్స్ డాక్టర్ శ్రీకృష్ణ, పల్మనాలజిస్ట్ డాక్టర్ దేదీప్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీధర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పూజ కార్యక్రమం



పూజ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు,భక్తులు

**చార్మినార్,జూలై 26 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం ఆవరణలో శనివారం భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ శివ పార్వతులకు సంఘం ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అత్యంత వైభంగా భవ్య కావడి యాత్ర జరుగుతుందని సంఘం ప్రతి నిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతి నిధులు మాంగే రామ్ తాయల్,సురేంద్ర అగర్వాల్,చంపాలాల్ బైద్,కమల్ కిశోర్ మాలాణి,పంకజ్ వర్మలు పాల్గొన్నారు.

### అన్నివర్గాల ప్రజలకు తోడ్పాటును అందిస్తున్న సంస్థ ఎల్ఐసి



సికింద్రాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ మధుసూదన్‌కు నాన్ సింగల్ ప్రీమియము చెక్కును అందిస్తున్న సంస్థ డివిజన్ ముఖ్య సలహాదారు కౌటికె విఠల్

**చిక్కడపల్లి, జూలై 26 ప్రభాతవార్త:**

భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) అన్నివర్గాల ప్రజలకు ఎంతో తోడ్పాటును సహకారాన్ని అందిస్తోందని ఆ సంస్థ సికింద్రాబాద్ డివిజన్ ముఖ్య సలహాదారు కౌటికె విఠల్ అన్నారు. శనివారం ఆ సంస్థ "జీవన్ ఉత్సవ్" పథకంలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పాలసీకి గాను నాన్ సింగల్ ప్రీమియము చెక్కును సికింద్రాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ మధుసూదన్‌కు కౌటికె విఠల్ అందించారు. ఎన్ఎస్పి కింద ఎక్కువ మొత్తంలో చెక్కును అందించడం గర్వంగా ఉందన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్‌గా సేవలందిస్తూ అఖిల భారత దేశంలోనే ఉన్నత స్థానంలో ఉండి తన పాలసీదారుల జన్మదినోత్సవాలను ప్రత్యేకంగా జరుపుకోవడం ఒక అలవాటుగా చేసుకున్న కౌటికె విఠల్ అభినందనీయులు అని వక్తలు కీర్తించారు.

### తోపులాటలో హౌసింగ్‌బోర్డు ఉద్యోగి మృతి

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:**

ఫంక్షన్ హాల్ యాజమాన్యంతో జరిగిన తోపులాటలో తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఉద్యోగి మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మెహదీపట్నం ఆర్టీసీ డిపో ముందు ఉన్న ఎంపి గార్డెన్స్ ఫంక్షన్ ప్యాలెస్ యాజమాన్యం గత ఎనిమిదేండ్లుగా హౌసింగ్ బోర్డుకు చెల్లించాల్సిన లీజు డబ్బులు చెల్లించడం లేదు. సుమారు రూ.1.50 కోట్ల బకాయి ఉండటం.. ఎన్ని సార్లు నోటీసులు అందించిన ఫంక్షన్ హాల్ యాజమాన్యం స్పందించకపోవడంతో కార్పొరేషన్ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసేందుకు శనివారం తమ సిబ్బందితో కలిసి కార్పొరేషన్ అధికారులు ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఫంక్షన్ హాల్ యాజమాన్యానికి కార్పొరేషన్ అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. అది కాస్తా తోపులాటకు దారితీయడంతో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ ఆర్.జగదీశ్వర్ రావు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో తోటి ఉద్యోగులు ఆయనను హుటహుటినా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీశ్వర్ మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసులు సరైన బందోబస్తు కల్పించకపోవడంతోనే తమ ఉద్యోగి చనిపోయారని హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముగ్ధమనోహరం అన్విత కూచిపూడి నృత్యప్రదర్శన



అన్వితరాణి కూచిపూడి నృత్యంలో దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 26 ప్రభాతవార్త :**

అమెరికాకు చెందిన ప్రముఖ కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకున్న దుర్గాలావణ్య, వంశీమోహన్‌ల కుమార్తె అన్వితరాణి తమ మాతృదేశం, పుట్టిన భూమిపై మమకారంతో అమెరికాలో ప్రఖ్యాత నాట్యగురువు కళారత్న సుజాత వింజమూరి వద్ద తెలుగుజాతి సొంతమైన కూచిపూడి నృత్య మెళకువలు సంపూర్ణంగా అభ్యసించి అమెరికా నుండి హైదరాబాద్‌కు వచ్చి కూచిపూడి రంగప్రవేశం చేయడం మాతృభూమి, రాష్ట్రం, భాష, కళలపై అత్యంత ప్రేమాభిమానాలను తెలియజేయడం హర్షనీయమని వక్తలు అన్నారు. అన్విత కూచిపూడి రంగప్రవేశంలో దశావతారం, అయిగిరినందిని, గోవర్ధనగిరిధారి, ఎందరో మహానుభావులు, కట్టెదుర, భామప్రవేశం తదితర అంశాలను అత్యంత అద్భుతం ప్రదర్శించి అందరి ప్రశంసలందుకున్నారు. శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన కూచిపూడి రంగప్రవేశంకు ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీనటి, మాజీ పార్లమెంటు సభ్యురాలు జయప్రద, సినీనటి లయ, తిరుమల కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, ఎండి నంగునూరి చంద్రశేఖర్ తదితర ప్రముఖులు విచ్చేసి కళాకారిణిని ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

### గంగపుత్రుల కులవృత్తిరక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

**-గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు శంకర్ డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్, నర్సింగ్, సత్యనారాయణ తదితరులు

**హైదరాబాద్,జూలై 26,ప్రభాతవార్త:**

సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రుల కులవృత్తి రక్షణ కు ప్రత్యేక చట్టం తేవాలని గంగపత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మంగిలిపల్లి శంకర్ గంగపత్ర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన జి 6/2016, జిఓ 4/2022 ల ద్వారా మత్స్యకారులైన బెస్త గూండ్ల, గంగపుత్రుల కులవృత్తిలోకి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలోకి ఇతర కులాలను అక్రమంగా చేర్చారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత ఎక్స్‌పర్ట్ కమిటీ గంగపుత్రుల కులవృత్తి దోపిడీకి కుట్రలు చేసిందన్నారు. ముదిరాజ్ లు తమ హక్కుల కోసం పోరాడితే మద్దతు ఇస్తామని కానీ, చేపలు పట్టే తమ కులవృత్తిని ఆశిస్తే సహించబోమని హెచ్చరించారు. నూతన సభ్యత్వానికి తీసుకొచ్చిన మెమోను రద్దు చేయాలని కోరారు. 2014 నుంచి 2023 వరకు మూడువేల మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు 2 లక్షల సభ్యత్వాలు చేశారని, దీనిపై విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కైరంకాండ నర్సింగ్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ హస సత్యనారాయణ, కార్యదర్శులు ఎర్రబోకయిన ప్రవీణ్, కుంట ప్రవీణ్, దువ్వల శ్రీకాంత్ సింగారం రవీందర్ పాల్గొన్నారు.

## ఆగస్టు 7న గోవాలో ఓబిసి 10వ జాతీయ మహాసభ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**సైఫాబాద్, జులై 26 ప్రభాతవార్త:** అఖిల భారత ఓబిసి 10వ జాతీయ మహాసభ ఆగస్టు 7వ తేదీన గోవాలో జరుగుతుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బిసిలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని చెప్పారు. బిసిల రిజర్వేషన్‌లపై బిజెపికి చిత్తశుద్ధి లేదని, జూటా పార్టీగా మారిందని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి, 48 గంటల్లోగా బిసి బిల్లును అమోదించాలని డిమాండ్ చేశారు. లేకపోతే 'బిజెపికి హటావో-బిసిల రిజర్వేషన్‌లు బచావో' అనే నినాదంతో వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి నాయకులను బిసిలు ఎక్కడ తిరగనీయకుండా అడ్డుకుంటారని ఆయన హెచ్చరించారు. ఆ తరువాత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. రిజర్వేషన్‌లు కల్పిస్తే బిజెపికి పూలవర్షం కురిపిస్తామని, లేకపోతే రాళ్ళ వర్షం పడుతుందని ఆయన హెచ్చరించారు. బిసిల 42 శాతం రిజర్వేషన్‌లపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక మాట, మరోక మంత్రి బండి సంజయ్ మరోక మాట, బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు ఇంకొక మాట మాట్లాడుతున్నారని ఆయన నిశితంగా విమర్శించారు. ఈ సమావేశానికి బిసి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మణిమంజరి అధ్యక్షత వహించగా, బిసి నేతలు కుందారం గణేషాచారి, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, సుజాత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT :: KUSHAIGUDA**
**O.S.No.500 of 2025**

Between:-
Smt S.Savithri @ S.Sandiya & Others ...Petitioners
AND
The Thahsildar, Malkajgiri Mandal & Others ...Respondents

**PUBLIC NOTICE**

General Public are hereby notified that my Clients S.Savithri (Alias) S.Sandiya & Others have filed above Suit for declaring them as Legal Heirs in respect of her husband Late Javantheeswaran Shankaran.
That the above case is posted for hearing on **30/7/2025** and anybody having any objection for declaring the Petitioners herein as Legal heirs of Late Javantheeswaran Shankaran, S/o.Late Javantheeswaran may represent their case before the Hon'ble Court on the above date of hearing failing which, the matter will be decided and no Objections of whatsoever nature will be entertained thereafter.

**// BY ORDER OF COURT //**

Sd/-
**A.S.SHANKER GOUD, BA, LLB, PGDCL. ADVOCATE.**
Plot No.9, Lothukunta
Alwal, Secunderabad-500 015, TG.
Mobile No.+91 7672018397

## మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు : చిలక నరసింహా రెడ్డి



మార్కెట్‌లో డ్రైనేజ్ మ్యాన్ హోల్లను జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులతో కలిసి శుభ్రం చేయిస్తున్న ఇన్చార్జి ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట,జూలై 26, ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నరసింహారెడ్డి పేర్కొన్నారు. గత కొద్దిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో ఇంచార్జ్ ఎస్జిఎస్ చిలక నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులు, సిబ్బందితో కలిసి మార్కెట్లో పర్యటించి డ్రైనేజ్ మ్యాన్ హోల్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహించకుండా ఉండడం కోసం డ్రైనేజ్ మ్యాన్ హోల్లను శుభ్రం చేయించడం జరిగిందని వివరించారు. అదేవిధంగా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా ఉండడం కోసం చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్నింటిని అభివృద్ధి చేసి ఆధునాతనంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులు ప్రజ్ఞా రెడ్డి, మోబిన్, నాగరాజు, మార్కెట్ సిబ్బంది పవన్, శ్రీకాంత్, పెద్ద రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం



**నేరేడ్‌మెట్, జూలై 26, ప్రభాతవార్త**

మల్కాజ్గిరి డివిజన్ అభివృద్ధిలో భాగంగా కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో బలరాంనగర్‌లో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శనివారం శుభారంభం చేయడం జరిగింది. అధికారులు, స్థానిక ప్రజల సమక్షంలో శ్రవణ్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టారు.ఇంతకాలంగా బలరాంనగర్ వాసులు ఎదుర్కొంటున్న రహదారి, డ్రైనేజీ సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారమవుతుందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా మరో రూ.10 లక్షల వ్యయంతో జరుగుతున్న రోడ్డు పనులను కూడా కార్పొరేటర్ శ్రవణ్ ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గగానే పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ నవీన్, రమేష్, కాలనీ ప్రముఖులు సూరజ్ సింగ్, సతీష్, విజయ్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, అడ్వొయిట్ కుమార్, గోపాల్ సింగ్, ఎస్.పి. రాజ్, రఘువీర్ సింగ్, మని కుమార్, సుజాత, సక్కు భాయ్, శ్రీనివాస్, నందు యాదవ్, మురళి గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.కార్పొరేటర్ శ్రవణ్ ప్రజల అభ్యర్థనలపై స్పందిస్తూ,"ప్రతి కాలనీలో వసతి సౌకర్యాలు మెరుగుపరచడం నా ప్రథమ కర్తవ్యం. అభివృద్ధి పనులు కొనసాగుతాయి," అని తెలిపారు.

## పోలిసులకు ఘన సన్మానం



**నేరేడ్ మెట్, జూలై 26,ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో బోనాల పండుగను ప్రజలు ప్రశాంతంగా, భద్రతా వాతావరణంలో జరుపుకునేలా నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ నేతృత్వంలో భద్రతా ఏర్పాట్లు చక్కగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు ఉల్లాసంగా పండుగను జరుపుకోవడాన్ని నాయకులు ప్రశంసించారు. ఈ క్రమంలో మల్కాజిగిరి లోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఐక్యంగా ముందుకొచ్చి, పోలీసుల సేవలపై కృతజ్ఞతలు తెలిపారు. సీఐ సందీప్ కుమార్ కి, వారి పోలీస్ సిబ్బందికి సన్మానం చేసి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నాయకులు:టిడిపి: వగ్గు చంద్రశేఖర్ రావు, కరణం గోపికాంగ్రెస్: జీడి నవీన్ గౌడ్జనసేన: జినికుంట్ల రమేష్ గౌడ్, మధుబిజెపి: గోపాలకృష్ణ, రుత్విక్ అడ్వకేట్బిఆర్ఎస్: జోగు శ్రీనివాస్ సిపిఎం: లక్ష్మణ్సిపిఐ: యాదయ్య గౌడ్బీఎస్పి: గౌతమ్బీసీ సంఘం: సంపత్ ఈ కార్యక్రమం రాజకీయ భేదాబి.ప్రాయాలకు అతీతంగా మల్కాజిగిరి ప్రజల భద్రతకు అందరూ మద్దతుగా ఉన్నారన్న సందేశాన్ని ప్రసారం చేసింది. పోలీసు శాఖకు ఈ కృతజ్ఞతలు, పౌరజనతా పరిరక్షణకు సమర్పణగా నిలిచాయి.

## దేశం కోసం ప్రాణాలర్పించిన కార్గిల్ వీరులు



కార్గిల్ వీరులకు నివాళులర్పిస్తున్న యష్పాల్‌గౌడ్

**ఎల్.బి.నగర్, జూలై 26 ప్రభాతవార్త:**

దేశం కోసం ప్రాణాలర్పించిన కార్గిల్ వీరులు చిరస్మరణీయులనే బిజెపి సీనియర్ నాయకుడు యశ్పాల్‌గౌడ్ పేర్కొన్నారు. 2025 జూలై 26న జరిగిన కార్గిల్ అమరవీరుల త్యాగాన్ని స్మరిస్తూ శనివారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బిజెపి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు యశ్పాల్‌గౌడ్ మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన కార్గిల్ వీరుల త్యాగాలను మనం ఎప్పటికీ మరచిపోవద్దన్నారు. యువతలో దేశభక్తి భావాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. భరతమాత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఇది మన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, యువమోర్చా అధ్యక్షులు కిరణ్‌కుమార్, తరుణ్‌సింగ్, సంప్రి త్, సాయి, నితిన్, రాజు, వినోద్, బావన, వెంకటేష్, గౌరవ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

## -ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే.

**హయత్ నగర్, జులై 26 ప్రభాతవార్త :**

తమది ప్రజా ప్రభుత్వమని... కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమ సాధ్యమని ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని తారా ఫంక్షన్ హాల్ లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి ఆయన లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో పది వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తున్నామని వివరించారు. ఆరు గ్యారెంటీలలో భాగంగా నియోజక వర్గానికి 3500 ఇండ్లు ఇస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చొరవతో రోడ్ల కోసం తుర్కంజాల్ మున్సిపాలిటీకి 100 కోట్లు, పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీకి 50 కోట్ల రూపాయలు తెచ్చుకున్నామన్నారు. ధరణీ పేరుతో గత ప్రభుత్వం పెద్దలు ప్రభుత్వ భూములను రికార్డులలో ఎక్కించుకున్నారని ఆరోపించారు. భూమాత తో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పట్నం మహేందర్ రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, చిలుక మధుసూధన్ రెడ్డి, పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీలను సన్మానిస్తున్న కాలనీవాసులు దండెం రాజశేఖర్ రెడ్డి, హరి గోవింద్ తదితరులు

**మలక్ పేట ,జూలై 26, ప్రభాతవార్త:**

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ ఎస్బిఐ ఆఫీసర్స్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న మంచినీటి పైప్ లైన్ నిర్మాణం పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తో కలిసి ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మలక్ పేట్ నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతినిత్యం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క మదూసుధన్ రెడ్డి, దండెం రాజశేఖర్ రెడ్డి, ఇలియాస్, హరి గోవింద్, రంగాచార్యులు, ఎంవీ కృష్ణారావు, పారిశ్రామికవేత్త గోవుల రాములు తదితరులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైయిన్ పనులతో దశాబ్దాల డ్రైనేజీ సమస్య తీరనుంది

## - కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి



కోటి 20 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

**కుషాయిగూడ, జూలై 26 ,ప్రభాతవార్త :** కాప్రా ఎల్లారెడ్డీగూడ ప్రధాన రహదారిలోని దాబాగార్డెన్స్ నాలా వద్ద శనివారం బాక్స్ డ్రెయిన్ పనులను కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ ఎల్లారెడ్డి గూడ సాయిబాబా ఆలయం, ఎల్లారెడ్డిగూడ, పరిసర కాలనీల డ్రైనేజి సమస్యలు బాక్స్ డ్రెయిన్ పనుల ద్వారా తీరనుందని తెలిపారు. ఎల్లారెడ్డిగూడ వాసులు ఏళ్ల తరబడి సతమాతమొతున్న డ్రైనేజి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చినా గత ప్రభుత్వాల అలసత్వంతో సమస్యతీరలేదని, తాను ఈ డ్రైనేజి సమస్యను ప్రతిష్టాత్మకంగా భావించి అధికారులపై వత్తిడి తీసుకొచ్చి ప్రతిపాదనలు తయారు చేయించి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సంప్రదించగా రూ. 1.20కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పనుల ద్వారా ఎల్లారెడ్డి గూడా, దాబాగార్డెన్, షిరిడి నగర్ తదితర కాలనీల ప్రధాన సమస్య తీరనుందని, అలాగే త్రాగునీటి సమస్యను కూడా త్వరలో తీర్చనున్నామని ఎల్లారెడ్డి గూడా వాసులకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ అభివృద్ధికై సమతుల్యంగా నిధులు మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తుండంతో డివిజన్లో ప్రతీనెల దాదాపు రూ.2కోట్ల పనులు చేపడుతున్నామని, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి,, డివిజన్ అభివృద్ధికి వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎల్లారెడ్డి గూడా పరిసర కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలిపారు. కాప్రా డివిజన్ అధ్యక్షుల కొబ్బనూరి నాగేశ్వర మాట్లాడుతూ గ్రామ పంచాయతీమునిసిపల్ కాలం నాటి నుండి ఎల్లారెడ్డి గూడా వాసులము ఓపెన్ డ్రైనేజి సమస్యతో అవస్తలు పడ్డామని, ప్రభుత్వాలు నాయకులు మారినా తమ సమస్య తీరలేదని, కాలక్రమేణా ఎల్లారెడ్డిగూడ చుట్టూ జనావాసాలు, కాలనీలు విస్తరించి జనసంఖ్య పెరగడంతో ఈ సమస్య ఝటిలమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. తాము దాదాపు మూడున్నర దశబ్దాల డ్రైనేజి సమస్యను కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి గారి దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డినీ సంప్రదించగా రూ. 1.20కోట్ల నిధులు మంజూరు చేయించి ఈరోజు బాక్స్ డ్రెయిన్ పనులను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి గూడా వాసుల తరపున మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కృతజ్ఞతలు తెలిపారు. తన పిలుపు మేరకు కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కాలనీల ప్రతినిధులకు, డివిజన్ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సర్కిల్,డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ గారు, అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్ గారు మరియు సిబ్బంది, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ గారు, ఏఎంసి డైరెక్టర్ పూర్ణయాదవ్ గారు, ఏఎంసి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు గారు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి పవన్ కుమార్, మల్లారెడ్డి,రాకేష్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, సత్తి రెడ్డి, జ్ఞానేశ్వర్ గౌడ్, ప్రకాష్, సత్యం ,శ్రీకాంత్ గౌడ్, జి సత్యనారాయణ, టి శ్రీహరి, రిజ్వాన్ ఖాన్, సాయి యాదవ్, వినోద్, ఆకుల సంతోష్, నాగరాజు యాదవ్, సోంనాథ్,మూర్తుజా,మనోజ్, ప్రదీప్, అహ్మద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్ కార్యాచరణతో ముందుకు పోవాలి : మాజీ సిఎస్ ఎల్వీ సుబ్రమణ్యం



గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఉమ్మడి ఏపి మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం: చిత్రంలో టికెఆర్ కాలేజీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి తదితరులు



గ్రాడ్యుయేషన్ డేకు హాజరైన విద్యార్థులు

**సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణ ద్వారా ముందుకు సాగాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య కార్యదర్శి (సిఎస్), ఐఎఎస్ అధికారి ఎల్వి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో శనివారం టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ తీగల అమర్‌నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 20వ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డే సెర్మనీని ప్రారంభించారు. అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ అప్‌డేట్ అవుతున్నందున ఇంజనీరింగ్ విద్యార్థులు ఆ దిశగా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకున్న విద్యార్థులు లక్ష్య సాధనలో విజయం సాధిస్తారని ఆయన తెలిపారు. నేర్చుకున్న విద్యను సమాజానికి ఉపయోగపడే విధంగా చేయాలని ఆయన కోరారు. జీవితంలో క్రమశిక్షణ ముఖ్యమైనదనీ గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. కాలేజీలను స్థాపించిన నాటి నుండి వేల మంది విద్యార్థులను తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి, కార్యదర్శి తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డిలను ఆయన అభినందించారు. కాలేజీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన స్వంత ఊరు మీర్‌పేట్‌లో విద్యా సంస్థలను నెలకొల్పి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. తమ కాలేజీల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు దేశ విదేశాల్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడడం తృప్తినిస్తున్నదని వెల్లడించారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముఖ్య అతిథిగా ఎల్వీ సుబ్రమణ్యం చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్లు రవిశంకర్, మురళీ మోహన్, పలువురు హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డమీది లక్ష్మీనర్సింహారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జాన్సన్‌లతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు లేని డివిజన్‌గా నాచారంను తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే బండారి

**నాచారం, జూలై 26 ప్రభాతవార్త :** నాచారం అన్నపూర్ణ కాలనీలోని అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ ముందు ఉన్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు రూ.50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగింది. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ గారితో కలిసి పనులను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే గారికి మరియు కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాలతో సత్కరించడం జరిగింది. రాఘవేంద్ర నగర్ అన్నపూర్ణ కాలనీలో దాదాపుగా అన్ని రోడ్లు కొత్తవి వేయించడం జరిగిందని ఈ రోడ్డుతో రాఘవేంద్ర నగర్ చుట్టుపక్కల దాదాపుగా అన్ని రోడ్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ తెలియజేశారు. డివిజన్లో మిగిలిన అభివృద్ధి పనులు అన్నీ కూడా ఒక్కొక్కటిగా మంజూరు చేయించి పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఈ బాలకృష్ణ, ఏఈ. వినీత్ మరియు బారాస నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

## పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు



పల్లవి ఇంర్నేషనల్ స్కూల్లో జరగిన వేడుకల్లో పాల్గొన్న స్కూల్ సిబ్బంది విద్యార్థులు

**నాచారం, జూలై 26 ప్రభాతవార్త :** పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో 2025...26 సంవత్సరానికి ఇన్వెస్టిచర్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల అధికారిక ప్రవేశ వేడుకగా కన్నుల పండుగవగా జరుపుకున్నారు.పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, విద్యార్థులకు సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా యాజమాన్యం పేర్కొంది. ఇన్వెస్టిచర్ వేడుక పాఠశాల క్యాలెండర్‌లో ఒక ముఖ్యమైన సంఘటన ఇది అన్నారు. విద్యార్థులలో బాధ్యత నాయకత్వ సంస్కృతిని పెంపొందించడంలో పాఠశాల అంకితభావాన్ని సూచిస్తుంది.ఈ సంవత్సరం ఇన్వెస్టిచర్ వేడుకకు ఏసీపీ (ట్రాఫిక్) బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే గౌరవ అతిథి రామకృష్ణ పవిత్ర దీపం వెలిగించడంతో వేడుక ప్రారంభమైంది. కొత్తగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు ముఖ్య అతిథి బ్యాడ్జ్‌లను ప్రదానం చేశారు. దీని తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం, పాఠశాల జెండాను ఆవిష్కరణ జరిగాయి. ముఖ్య అతిథి కొత్తగా ఎన్నికైన పాఠశాల క్యాబినెట్ సభ్యులను అభినందించారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ కోడూరు కొత్త కౌన్సిల్ సభ్యులను అభినందించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

## ఎరుకల రవిగౌడ్‌కు పారిజాత పరామర్శ

**సరూర్‌నగర్, జూలై 26 ప్రభాతవార్త:**



ఎరుకల రమేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మేయర్ పారిజాత

పితృ వియోగం కలిగిన దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఎరుకల రమేష్‌గౌడ్ సోదరుడు, మీర్‌పేట్ కార్పొరేషన్ నాయకుడు ఎరుకల రవిగౌడ్‌ను టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరామర్శించారు. శనివారం ఉదయం మీర్‌పేట్ కేశవరెడ్డి నగర్‌కు వచ్చిన ఆమె రవిగౌడ్ తండ్రి వెంకటయ్య భౌతికయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పారిజాత ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సీనియర్ సిటిజన్ రీడింగ్ క్యాబిన్ ప్రారంభం



రీడింగ్ రూమ్ను ప్రారంభిస్తున్న అరుణసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జులై 26 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని చాణిక్యపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కులో సీనియర్ సిటిజన్ రీడింగ్ క్యాబిన్ హాల్‌ను నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లో ప్రశాంతమైన వాతావరణంలో రీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాణిక్యపురి కాలనీ ప్రెసిడెంట్ రావుల చలపతిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఇ.వేణుగోపాల్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీధర్ బాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కుప్పకూలిపోయిన స్ట్రామ్ వాటర్‌లైన్



స్ట్రామ్ వాటర్‌లైన్‌ను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జులై 26 ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్ కాలనీలో స్ట్రామ్ వాటర్‌లైన్ కుప్పకూలింది. సమాచారం తెలిసిన కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులను పిలిపించి పరిస్థితిని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, కుప్పకూలిన లైన్‌కు వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నవీన్‌కుమార్, ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హైడ్రా సిబ్బంది ఎస్ఆర్ఎల్ కాలనీ అధ్యక్షులు సుధాకర్, రామేశ్వర్‌గౌడ్, దత్తాత్రేయ, తులసి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిట్స్ పంపిణీ

**మల్కాజిగిరి జూలై26,ప్రభాతవార్త :**



మౌలాలి డివిజన్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి కార్యోరేటర్ గున్నాల సునీత యాదవ్ హాజరై అందజేశారు.ఈ సందర్భంగా కార్పొ రేటర్ గున్నాల సునీత యాదవ్ మాట్లాడుతూ...పారిశుద్ధ్య కార్మికులు పరమాత్ముని సేవకులు లాంటి వారు అని కొనియాడారు, సేవా భావం కలిగిన సమాజ ఆరోగ్య కార్యకర్తలు అని హైదరాబాద్ మహానగరంలో తీవ్ర వర్షాలు పడుతున్నా కానీ ప్రజలు తమ నివాసాలలో ఉన్నా కానీ పారిశుద్ధ్య కార్మికులు మాత్రం వర్షంలో రోడ్ల పైన నీటి వరద కాలువలలో అత్యవసర పరిస్థితులలో నాళాలలోని చెత్తచెదారాలు తొలగించుట నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను నీరు పోయేటట్లు చేయుట తదితర కార్యక్రమాలు చేపడుతున్నారని అటువంటి వారి సేవలను ప్రజలు గుర్తించి ఇంకా వారి నీ ఇబ్బందులు పెట్టకుండా ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తమ ఇంటిలోని చెత్తను జాగ్రత్తగా స్వచ్ఛ్ ఆటో టిప్పర్ కు మాత్రమే అందించాలని నాలా లలో బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయ రాదని వార్డు ప్రజలను విజ్ఞప్తి చేసినారు, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కిడ్స్ ఇవ్వటం చా లా సంతోషంగా ఉన్నదని వారి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం అని తెలిపారు. మీ వంతుగా డివిజన్ ని పారిశుద్ధంలో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దాలని కోరారు.కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ చింత శ్రీనివాస్ అజయ్, యాదగిరి, కిష్టమ్మ భారతి అంజమ్మ మనీషా ఊర్మిళ,భాస్కర్ రావు సంగీత పాలోన్నారు.



చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీలో జరిగిన బొడ్రాయి పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యువనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీహరి, పురుషోత్తం, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు. (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)